
# తల్లి మనసు

— పాణంపల్లి నాగభూషణం




"ఏమిటో వదినా ఈ మధ్య నా కొడుకు, కోడలు పూర్తిగా మారిపోయారు. నన్ను అసలు పట్టించుకోవడం మానేశారు."

"ఏం జరిగింది?"

ఇదివరకయితే అమ్మా సుగర్ మందులున్నాయా? అమ్మా బి.పి. మాత్రలున్నాయా? అమ్మా విటమిన్ మాత్రలున్నాయా అని ప్రతిరోజూ అడిగేవాడు మా అబ్బాయి. ఇప్పుడు మాత్రలు అయిపోయాయిరా అబ్బాయి అన్నా పట్టుకు రావడం లేదు. చెప్పి వా నోరు నెప్పిపుట్టోంది తప్ప' కంటనీరు పెట్టుకొంది అరవై ఏళ్ళ పార్వతమ్మ.

వదినా అంటూ ఆవిడ్ని సంబో ధిస్తున్నది బంధువని కాదు. చాలా కాలంగా స్నేహంగా వుంటున్న పక్కింటి శంకుతలని.

పార్వతమ్మకి జుట్టు నెరిసింది. చర్మం ముడతలు పడింది. శరీరంలో పటుత్వం తగ్గింది. కంటి చూపు తగ్గింది. వృద్ధాప్యంవల్ల ఆరోగ్యం తగ్గింది. వీటివల్ల మందుల వాడకం పెరిగింది. మందుల కోసం పెట్టే ఖర్చు పెరిగింది. డబ్బు ఖర్చు అయిపోతోంది అన్న బాధ పెరిగింది. ఇంట్లో అశాంతి పెరిగింది.

"ఊరుకో వదినా, ఊరుకో బాధపడకు" ఓదార్చింది శకుంతల. "మేము అంతా ఎంత చెప్పినా వినకుండా నీ పేరు మన్న ఎకరం భూమి అమ్మేసి నీ కొడుక్కి ఇచ్చేశావు. నువ్వు అట్టేపెట్టుకో అంటే వివలేదు."

"ఏం చెయ్యను. కడుపుతీపి నీకు తెలీదా వదినా. వాడు బిజినెస్‌లో డబ్బులు చాలక అవస్థపడుతూ, అక్కడా ఇక్కడా అప్పులు చేస్తుంటే వాడి బాధ చూడలేక భూమి అమ్మేసి డబ్బు వాడికిచ్చాను" గద్గద కంఠంతో అంది పార్వతమ్మ.

గడియారం నాలుగు గంటలు కొట్టింది. "ఇక నేను వస్తాను. కోడలూ-పిల్లలూ స్కూళ్ళ నుంచి వస్తారు" అంటూ లేచింది పార్వతమ్మ.

"వుండు" అంటూ లోపలికి నెళ్ళి ఓ వందనోటు తెచ్చి పార్వతమ్మ చేతిలో పెట్టింది శకుంతల. 'వుంచు ఏ మందో, మాక్కో

పనికొస్తుంది" అంటూ.

సిగ్గుపడుతూ వద్దంటూనే మొహమాటంగా ఆ డబ్బు తీసుకొని ఇంటికెళ్ళిపోయింది పార్వతమ్మ.

"అద్దాలనాడు బిడ్డలుకాని గడ్డాలునాడు కాదుకదా"

"ఎవరి గురించి చెప్తున్నావు పిన్నీ"

"ఎవరి గురించో నేను ఎందుకు అంటాను. మీ అన్నయ్య గురించే. వాడు పూర్తిగా మీ వదిన వలలో పడిపోయాడు. నేను బతికానో చచ్చానో కూడా వాడికి అక్కర్లేదు" వాపోయింది పార్వతమ్మ తన అక్క కూతురు పద్మ దగ్గర.

"అరెరె అదేంటి పిన్ని, ఎన్నడూ లేంది అన్నయ్య గురించి అలా మాట్లాడతావు."

"అవునమ్మా ఇదివరకెపుడూ లేదు. ఈ మధ్యే వచ్చింది వాడికీ రోగం. నా రోగం గురించి పట్టించుకోడు. మందులు తేడు" గుడ్ల నీరు గుక్కుకుంది పార్వతమ్మ.

"ఊరుకో పిన్నీ ఊరుకో. ఇంద ఈ డబ్బుతో నీక్కావలసిన మందులు కొనుక్కో" అంటూ కొంత డబ్బు పార్వతమ్మ చేతిలో వుంచింది పద్మ.

ఈ తరహా సన్నివేశాలు చాలా జరిగాయి. అందులో పార్వతమ్మ కామన్, అవతలి వ్యక్తులే మారేవారు. ఒకసారి పక్కింటావిడ, మరోసారి బంధువు ఇలా.

పార్వతమ్మ ఎవరో కాదు నా బాల్యస్నేహితుడు **శరత్** తల్లి. శరత్ అటువంటివాడు కాదు. తల్లిని ప్రాణప్రదంగా చూసుకునేవాడు. ఈ సంభాషణలు అన్నీ చిలవలు పలవలుతో బాగా పెంచబడి వాడి చెవినబడ్డాయి. ఓరోజు ఇవన్నీ చెప్పి నా దగ్గర బావురుమన్నాడు శరత్.

"ఎప్పడడిగినా మందులు వున్నాయంటుంది. బలవంతంగా తెచ్చి ఇచ్చినా, ఆ సాయంత్రం మందులషాపు వాడికి తిరిగి ఇచ్చేసి, ఆ డబ్బు పట్టుకొచ్చి నాకిచ్చేస్తుంది. మరి వీధిలో తెలిసినవాళ్ళ దగ్గర, బంధువుల దగ్గర నేను తనని సరిగా చూడ్డంలేదని, మందులు కొనివ్వడంలేదని చెప్పి చెప్పి నా పరువు తీస్తోంది. ఏంచెయ్యాలో అర్థం కావటం లేదు. కొంపతీసి ముసలితనంవల్ల ఆవిడ మతి భ్రమించలేదుకదా"అని భయపడుతూ నా సలహా అడిగాడు శరత్.

ఇవన్నీ విన్న తర్వాత నాకూ పార్వతమ్మ ప్రవర్తనమీద అనుమానం వచ్చింది. ఆవిడ ఉద్దేశం ఏమై వుంటుంది 'కుమాతా నభవతి' చెడ్డ తల్లి వుండదు అని కదా పెద్దలు చెప్పింది. శరత్‌కోసం కాకపోయినా, ఆమె ఎందుకిలా చేస్తోందో తెల్సుకోవాలన్న కుతూహలం ఎక్కువైపోయింది నాకు.

ఓరోజు మధ్యాహ్నం ఎవరూ లేని సమయం చూసి శరత్ ఇంటికి వెళ్ళాను. పార్వతమ్మని చూసి "ఏం పెద్దమ్మా కులాసా?" అని అడిగాను. "ఏం కులాసా నాయనా, నీ స్నేహితుడు నన్ను పట్టించుకోవటంలేదు." అంటూ ఆవిడ అందరికీ తెల్పిన రికార్డు మొదలుపెట్టింది.

"నాకు అంతా తెల్సు. శరత్ నిన్ను ఏ కొడుకూ ఏ తల్లినీ చూసుకోనంత ఇదిగా చూసుకుంటున్నాడు. అయినా నువ్వు ఎందుకిలా అందరి దగ్గర చెప్పి వాడ్ని అప్రతిష్టపాలు చేస్తున్నావు" సీరియస్‌గా అడిగాను.

పార్వతమ్మ కంటనీరు పెట్టుకోవడం మినహా ఏం మాట్లాడలేదు. అవిడ్ని అనునయించి బతిమాలగా బతిమాలగా అసలు విషయం బైటపెట్టింది.

శరత్‌కి ఇటీవల అనారోగ్యంతో బిజినెస్ తగ్గి డబ్బుకి కటకటలాడుతూంటే, తన మందులకి వందలు వందలు ఖర్చు కావడం ఆ తల్లికి ఇష్టం లేకపోయింది. అందుకే వాళ్ళ దగ్గరా, వీళ్ళ దగ్గరా కొడుకు గురించి చెడ్డగా చెప్పి, తన మీద జాలి పుట్టేలా, తృణమో పణమో ఇచ్చేలా చేసేది. ఆవిధంగానైనా కొడుక్కి సాయం చెయ్యాలని ఆవిడ తపన.

"నువ్వే చెప్పు, నేనీ వయసులో, జవసత్వాలుడిగిన, వడలిన ఈ శరీరంతో నా కొడుక్కి నేనేవిధంగా సాయపడగలను. నావల్ల వాడికి కలిగే బాధల బరువుని ఏవిధంగా తగ్గించగలను."

"నువ్వు అలా చెయ్యడంవల్ల అందరూ శరత్ గురించి చెడ్డగా అనుకోరూ" అడిగాను నేను.

"అనుకోనీ, నేను చచ్చిపోయేటప్పుడు చుట్టూ వున్నవాళ్ళతో గట్టిగా అరచి చెప్తాను. నేను మీకు చెప్పినవన్నీ అబద్ధాలు. నా కొడుకు నన్ను కంటిపాపలా చూసుకునేవాడు. నా మందులకోసం వాడు వందలు వందలు ఖర్చుపెట్టడం నేచూడలేక అలా వాడి గురించి లేనిపోనివి కల్పించి చెప్పాను, అని ఎలుగెత్తి చాటి మరీ చచ్చిపోతాను" కంటికి మంటికి ఏకధారగా ఏడవసాగింది పార్వతమ్మ.

ఎంత పొరబడ్డాను! ఆ తల్లి మనసు అర్థం చేసుకోలేక ఏవేవో ఊహించుకున్న నా తెలివితక్కువతనానికి సిగ్గుపడుతూ, పార్వతమ్మ మొహంలోకి చూసే ధైర్యం లేక అక్కడనుంచి ఒక్క ఉదుటున బయటకి వచ్చేశాను.



అద్భుత శక్తిగల
ఉంగరం
12 గంటలలోనే మీ జాతకం మార్పు

ఆమె/ అతడు దృఢమైన, హృదయపూర్వక విశ్వాసంతో ఈ మంత్రశక్తి గల ఉంగరాన్ని ధరించిన/ తమ వద్ద వుంచుకున్ననూ పురుషుడు/ స్త్రీ మీ వశమౌతారు. ఈ ఉంగరం ధరించినవారు వ్యాపారంలో లాభాన్ని, కేసులలో విజయాన్ని, పరీక్షలలో ఉత్తీర్ణతను, ప్రతిష్ఠాత్మక సేవలను, కోరిన వివాహాన్ని, పిల్లలను, సంతోషాలను పొందడమేకాదు అవి నిరంతరం మీ చుట్టూ తిరుగుతాయి. ఏ పనిలోనైనా విజయం ఖాయం. అన్ని బాధల నుంచి మీకు విముక్తి. ప్రత్యేక తాంత్రిక ఉంగరం : రూ. 31/-; వెండి ఉంగరం : రూ. 101/-; బంగారు ఉంగరం : రూ. 351/-. 12 గంటలలోనే ఫలితాన్ని చూపగల, పేరు, రాశి చక్రం ప్రకారం ఇచ్చే శక్తివంతమైన అదృష్ట ఉంగరం : రూ. 921/- పోస్టల్ అండ్ ప్యాకింగ్ ఛార్జీలు అదనం.

<u>గమనిక</u> : ఈ ఉంగరం ఫలితాన్ని ఇవ్వనట్లైతే రెట్టింపు ధర తిరిగి ఇవ్వబడుతుంది. అసత్యమని నిరూపిస్తే రూ. 1,001/- బహుమతి ఇవ్వబడుతుంది. ఒక్కసారి పరీక్షించండి. ప్రభావాన్ని గుర్తిస్తారు.

*ADDRESS:*
**SANTOSHI ASHRAM (K/13)**
***P.O.: MAIRA BARITH (GAYA)***